క్లుప్తంగా

వినాయక చవితి శుభాకాంక్షలు


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుని ఆశీసులతో భోగభాగ్యాలు ప్రజలకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం


కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్ : పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా అందరూ మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం అంటు సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మంగళవారం పిలుపునిచ్చారు. ప్రజలకు అన్ని ఇబ్బందులు, విఘ్నాలు తొలగిపోయి సుఖ సంతోషాలతో తులతూగాలని ఆశిస్తూ.. సంజీవయ్య అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దొరవారిసత్రం: మండలంలో ఏకొల్లులోని జెడ్పీ హైస్కూల్లో మంగళవారం విద్యార్థులకు ఎయిడ్స్/హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ కంట్రోల్ విభాగం సహకారంతో నవజీవన్ ఆర్గనైజేషన్ సంస్థ ఈ కార్యక్రమం నిర్వహించింది. ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజి మాట్లాడుతూ, ఎయిడ్స్ రోగులను వివక్షతో చూడరాదని, వారినీ అందరితో సమానంగా చూడాలన్నారు. ఎయిడ్స్, హెచ్‌ఐవీ లక్షణాలు..దాని బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహారావు, ఉపాధ్యాయులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపండి


అవగాహన కల్పిస్తున్న రీచా సంస్థ సిబ్బంది

ఓజిలి: రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపాలని జిల్లా మోడల్ మేకర్ వీరరాఘవయ్య కోరారు. మండలంలోని ఆర్మేనిపాడులో మంగళవారం రీచా సంస్థ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించింది. సేంద్రియ పద్ధతుల్లో ఎరువులు, కషాయాల తయారీ, మల్చింగ్..మొదలైన వాటి గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ గోవర్ధన్‌రెడ్డి, రిచా సంస్థ సభ్యుడు కోటేశ్వర్‌రావు, శివ, ఐసీఆర్‌పీలు అజిత, భవాని తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 33.040 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 33.040 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9680 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1250, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం


మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న స్థానికులు

చిల్లకూరు : మండల కేంద్రంలోని శంకర గిరిజన కాలనీకి చెందిన ఓ నిరుపేద ఆలూరు శంకరయ్య మంగళవారం వేకువ జామున మృతి చెందడంతో అతని మట్టి కార్యక్రమాల ఖర్చులకు దాతలు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. చిల్లకూరు శంకర గిరిజన కాలనీకి చెందిన శంకరయ్య మృతి చెందిన వెంటనే అతని కుటుంబ సభ్యులు పరిస్థితిని పెంచలకోన మాజీ చైర్మన్ నానాజీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన మట్టి ఖర్చులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ ఆర్థిక సాయాన్ని స్థానికులు గడ్డం రామక్రిష్ణ,శంకర్, మల్లికార్జున, శివ, సాయి చేతుల మీదుగా అందించారు.


చికెన్ ధరలు 27-8-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	108
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	200
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	220
లేయర్ చికెన్	:	200

సైదాపురం: పల్లెలకు బయల్దేరిన బొజ్జ గణపయ్య, దొరవారిసత్రం: ఏకొల్లు, అక్కరపాక గ్రామాల్లో కొలువైన గణనాథుడు, నాయుడుపేట: మండపంలో కొలువైన భారీ వినాయకుడు, సూళ్లూరుపేట: కొలువుదీరేందుకు వెళుతున్న ఏకదంతుడు







గణపయ్య పూజకు వేళాయె!


సూళ్లూరుపేట: చవితి వేడుకలకు సిద్ధమైన గణపయ్య మండపం

వినాయక చవితి వేడుకలకు సర్వం సిద్ధమైంది. పూజాసామగ్రి కొనుగోలుదారులతో పట్టణాలు, మండల కేంద్రాలు కిటకిటలాడాయి. మండపాల్లో కొలువుదీరేందుకు గణపయ్య విగ్రహాలు వాహనాల్లో తరలిపోతున్నాయి. గ్రామాలు, పట్టణాలన్నీ చవితి వేడుకలతో కోలాహలంగా మారాయి. వాడవాడలా పండగ సందడి మొదలైంది. వినాయక మండపాలు విద్యుత్ అలంకరణతో మెరిసిపోతున్నాయి. విద్యుత్ కటౌట్‌లు భారీ స్థాయిలో ఏర్పాటు చేస్తున్నారు. నాయుడుపేటలో ప్రత్యేక సెట్టింగుల మధ్య 22 అడుగుల భారీ విగ్రహం నెలకొల్పుతున్నారు. చిల్లకూరు మండలం పారిచెర్లవారిపాలెం ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వినాయక విగ్రహం ఏర్పాటు చేసి వేద పండితులతో ద్వారా పూజా కార్యక్రమాలను పూర్తి చేసారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు వినాయక చరిత్రను విద్యార్థులకు తెలియజేశారు.

–సాక్షి నెట్‌వర్క్


సూళ్లూరుపేట: చవితి వేడుకలకు విద్యుత్ దీపాలంకరణ





వెంకటగిరి : విగ్రహాన్ని ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న యువత, కొనుగోలుదారులతో రద్దీగా మారిన పోలేరమ్మతల్లి వీధి, చిల్లకూరు: గణేశ పూజలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాయుడుపేట: ఆకట్టుకుంటున్న వినాయక మండపం

కాకాణితో వైఎస్సార్‌సీపీ శ్రేణులు


కాకాణి గోవర్ధన్ రెడ్డిని కలిసి సన్మానించిన చిట్టమూరు నాయకులు


మాజీ మంత్రిని కలిసిన కిలివేటి సంజీవయ్య, కామిరెడ్డి, ప్రజాప్రతినిధులు, పలు మండలాల నాయకులు

నాయుడుపేటటౌన్/చిట్టమూరు/పెళ్లకూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డిలతో పాటు పేట, చిట్టమూరు, పెళ్లకూరు మండలాల నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

ఆదిశంకరకు యూనివర్సిటీ హోదా


మాట్లాడుతున్న వంకి అరవింద

గూడూరురూరల్ : గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ హోదా రావడం ఎంతో గర్వకారణమని యూనివర్సిటీ ఛాన్సలర్ వంకి అరవింద అన్నారు. ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఛాన్సలర్ వంకి అరవింద డీమ్డ్ టు బీ యూనివర్సిటీ హోదాను అధికారికంగా ప్రకటించారు.

జాతరను విజయవంతం చేద్దాం


ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సైదాపురం/వెంకటగిరి రూరల్: పోలేరమ్మ తల్లి జాతరను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో జాతర విజయవంతం చేయడానికి కృషి చేయాలని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీన పేర్కొన్నారు. జాతర నిర్వహణపై పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు డీఎస్పీ గీతా కుమారి సమక్షంలో మండల స్థాయి అధికారులకు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది వీఐపీ దర్శనాలపై ఆంక్షలు విధించనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మిగిలిన వారిని అంతా టోకెన్ల క్యూలో పంపించాలని సూచించారు. గత ఏడాది జరిగిన పొరపాట్లను సరిచేసుకోవాలని స్పష్టం చేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ జాతర నిర్వహణలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులు కన్నా ఒక్కో డిపో నుంచి 5 బస్సులను అదనంగా కేటాయించాలని ఆర్టీసీ డీఎంకు సూచించారు. జాతరలో అలర్లు జరగకుండా ఉండేలా పోలీసు ప్రత్యేక దృష్టి సారించాలని సీఐ ఏవీ రమణకు ఆదేశించారు. ఈ ఏడాది జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.50 లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. డీఎస్పీ గీతా కుమారి మాట్లాడుతూ జాతరకు జిల్లా నుంచి 1000 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారి జాతరకు సంబంధించి ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ, ఆలయ ఈఓ వెంకటశ్రీనివాసులరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


అవగాహన కల్పిస్తున్న సివిల్ జడ్జి రాజేష్

చిల్లకూరు: ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నివసించే వారు కొంత మంది తమ బిడ్డలను బాగా చదివించలేక చిన్నతనంలోనే వివాహాలు చేస్తున్నారని ఇవి చట్టరీత్యా నేరమని గూడూరు సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ సూచించారు. గూడూరు రూరల్ పరిధిలోని చెన్నూరులోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మంగళవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అందించిన కొన్ని హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. చిన్నతనంలోనే వివాహాలు జరిపిస్తే వారికి పిల్లలు పుట్టిన సమయంలో తల్లీ బిడ్డలు మృతి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. అనంతరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సులోచనరాణి మాట్లాడుతూ మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కోటేశ్వరరావు, అరవ పార్వతయ్య, రూరల్ ఎస్‌ఐ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

బాల్య వివాహాలు అనర్థదాయకం

దక్కిలి: బాల్య వివాహాలు అనర్థదాయకమని, నిర్దిష్ట వయస్సు వచ్చాకే వివాహాలు చేయాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో వీవోఏలు, సీసీలు, సిబ్బందికి బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరగకుండా వీవోఏలు, అంగన్‌వాడీ, రెవెన్యూ ఉద్యోగులు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్న పక్షంలో తమ దృష్టికి తెస్తే పోలీసులతో కలిసి నిరోధించి, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్‌బేగం, స్థానిక వైద్యాధికారి బిందు ప్రియాంక, ఏపీఎం జమునారాణి, సీసీలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సురేష్ పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలనే పూజిద్దాం


వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న జేవీవీ సభ్యులు

చిల్లకూరు: వినాయక చవితి సందర్భంగా ప్రతి ఇంటా మట్టితో చేసిన ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని జేవీవీ సంస్థ సభ్యులు పిలుపునిచ్చారు. మట్టి ప్రతిమల ఆవశ్యకతపై గూడూరులోని టవర్ క్లాక్ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన ప్రతిమలు నిమజ్జనం చేస్తే నీటిలో కరగవని, పర్యావరణానికి హానికరమని తెలియజేశారు. మట్టి ప్రతిమల వాడకంపై అవగాహన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, సభ్యులు నారాయణ, నాగరాజు, సుమన్ రెడ్డి, ఇబ్రహీం, రజనీకాంత్, శ్రీనివాసాచారి, మస్తాన్, వెంకటేశ్వర్లు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

రాపూరు: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం పూర్తి చేయాలని డీఎల్‌డీఓ వసుమతి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎల్‌డీఓ మాట్లాడుతూ గతంలో నిలిచిపోయిన ఇళ్లను డిసెంబర్ లోపు పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న ఫారం ఫండ్స్, పండ్లతోట పెంపకాలను లక్ష్యాలను పూర్తి చేయాలని, మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ భవాని, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, ఏపీఓ చంద్రయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

పెళ్లకూరు: బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు ఎగువతాగేలికి చెందిన వంశీకృష్ణ, చక్రి నాయుడుపేటలో వినాయక విగ్రహాల కొనుగోలు కోసం బైక్‌పై బయల్దేరారు. మార్గంమధ్యలో ఫ్లైఓవర్ వద్ద రోడ్డు పక్కన పడి ఉన్న స్తంభాలను ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. వీరిని నాయుడుపేట ఆస్పత్రికి తరలించారు.

అక్షరాస్యత పెంచేందుకే ఉల్లాస్


సమావేశంలో మాట్లాడుతున్న భవాని

రాపూరు: వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకే ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భవాని అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం అక్షర ఆంధ్రాపై (ఉల్లాస్) శిక్షకులకు తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని నిరక్షరాస్యులైన వయోజనులు ఎంపిక చేసి వారిని అక్షరాస్యులుగా చేయాలని సూచించారు. నవంబర్ 2నుంచి వయోజనులకు తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ అధికారి కృష్ణకిషోర్, సూపర్‌వైజర్ రాజశేఖర్, మండల ఉల్లాస్ శిక్షణ అధికారి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకు 14 కొత్త ఆర్టీసీ బస్సులు

- కొత్తగా రాపూరు టు బెంగళూరు నాన్ ఏసీ స్లీపర్‌కోచ్ సర్వీసు
- రీజినల్ మేనేజర్ షమీం వెల్లడి


రాపూరు ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ సిబ్బంది, కార్మికులతో మాట్లాడుతున్న షమీం

రాపూరు: నెల్లూరు జిల్లా రీజినల్ పరిధిలో 14 కొత్త ఆర్టీసీ బస్సులు రానున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం షేక్ షమీం వెల్లడించారు. ఆర్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఆమె రాపూరు డిపోను సందర్శించారు. సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించి ఆమె మాట్లాడారు.జిల్లాకు కొత్తగా 17 బస్సులు అవసరమని ఉన్నతాధికారులను కోరడంతో తొలివిడతగా మూడు బస్సులను పంపారని, మిగిలిన బస్సులు త్వరలో వస్తాయన్నారు. కొత్తగా వచ్చే బస్సుల్లో రాపూరు డిపోకు కూడా కేటాయిస్తామన్నారు. రీజినల్ పరిధిలో 135 మంది ఆన్‌కాల్ డ్రైవర్లను ఎంపిక చేశామని, రాపూరు–రాజంపేట మధ్య నడిచే రెండు సర్వీసులను ప్రయాణికుల సౌకర్యార్థం రాజంపేట నుంచి నెల్లూరు వరకు పొడిగించినట్లు చెప్పారు. కొత్తగా రాపూరు–బెంగళూరు నాన్ ఏసీ స్లీపర్ కోచ్ బస్సులు నడపనున్నట్లు ఆమె తెలిపారు. బస్సుల్లో ప్రయాణించే మహిళలు తప్పనిసరిగా ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ అనిల్‌కుమార్, ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

బదిలీ టీచర్‌కు వీడ్కోలు సన్మానం


బదిలీ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ తదితరులు

దక్కిలి: స్థానిక పంచాయతీ కందలవారిపల్లె గిరిజన కాలనీలో పని చేసిన ఉపాధ్యాయురాలు ఉప్పలూరు సరళకుమారి సేవలు ఆదర్శనీయమని ఎంఈఓ వెంకటేశ్వర్లు, దక్కిలి కాంప్లెక్స్ హెచ్‌ఎం గీత ప్రశంసించారు. ఇక్కడి నుంచి నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలానికి ఆమె బదిలీ కావడంతో సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు మంగళవారం స్కూలులో ఆమెకు వీడ్కోలు సన్మానం చేశారు. ఆమె సేవలను ప్రస్తుతించారు. సరళకుమారి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనురాధ, టీచర్లు మాధవి, రత్నప్రభ, రాజ్యలక్ష్మి, జ్యోతి, సురేష్, అశోక్, రామయ్య, మండల పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


అవగాహన కల్పిస్తున్న జడ్జి సులోచనా రాణి

గూడూరురూరల్ : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సులోచనా రాణి అన్నారు. మండలంలోని చెన్నూరు గ్రామంలో మొదటి దళితవాడలో మంగళవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి సులోచనా రాణి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, సామాజిక సమస్యల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాజేష్, లీగల్ ఎయిడ్ కౌన్సిలర్ కోటేశ్వరరావు, రూరల్ ఎస్.ఐ మనోజ్‌కుమార్, అట్రాసిటీ కమిటీ సభ్యులు అరవ పార్వతయ్య పాల్గొన్నారు.